గాంధీ వార్డుల్లో దోమలు

- టాయిలెట్లు కంపుకొడుతున్నాయి
- సిటీస్కానింగ్‌లో జాప్యం జరుగుతోంది
- కేంద్రమంత్రికి తమ గోడును విన్నవించిన గాంధీ దవాఖాన రోగులు

గాంధీ దవాఖానలో ఓపీ సేవల కోసం భారీగా బారులు తీరిన జనం

సిటీబ్యూరో/బన్సీలాల్‌పేట, జూన్ 16 (నమస్తే తెలంగాణ): పేదల పెద్దాసుపత్రిగా పేరున్న గాంధీలో రోగుల నుంచే వార్డుల్లో దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, టాయిలెట్లు కంపుకొడుతున్నాయని దవాఖానలో చికిత్స పొందుతున్న రోగులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి తమ గోడును చెప్పుకున్నారు. సోమవారం గాంధీ వైద్యశాల సందర్శించిన కేంద్రమంత్రి వైద్యాధికారులతో కలిసి కొవిడ్ సమయంలో ప్రారంభించిన ఆక్సిజన్ ప్లాంట్‌ను సందర్శించి దాని పని తీరుని తెలుసుకున్నారు. అక్కడి నుంచి జీరియాట్రిక్, టీఎంటీ, రేడియాలజీ, డయాగ్నొస్టిక్, ఓపీ వార్డుల్లో ఉన్న రోగులతో మాట్లాడారు. సిటీ స్కానింగ్ యంత్రం కేవలం ఒక్కటే ఉన్నందున తీవ్రంగా జాప్యం జరుగుతున్నదని రోగులు ఆయనకు వివరించారు. ఓపీ కౌంటర్ల వద్ద ఆయుష్మాన్ భారత్ యాప్ డౌన్‌లోడ్ ఆలస్యం కావడం కారణంగా ఇబ్బందిపడుతున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్రమంత్రి విలేకరులతో మాట్లాడుతూ గాంధీ ఆసుపత్రిలోని కొన్ని విభాగాల్లో ప్రొఫెసర్ల కొరత అధికంగా ఉందన్నారు. నాలుగో తరగతి సిబ్బందికి సకాలంలో జీతాలు రావడం లేదని, కాంట్రాక్ట్ రెన్యువల్ ఇప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని స్పష్టం చేశారు. పేషెంట్ల సంఖ్య అధికంగా ఉండటంతో, అవసరమైన చికిత్సలు, సదుపాయాలు ఎప్పటికప్పుడు అభివృద్ధి చేస్తూ పోవాలన్నారు. ఆయుష్మాన్ భారత్ పథకం కింద, ఆధార్ ఆధారంగా పేషెంట్లకు కార్డులు జారీ చేస్తున్నారని, ఆ కార్డు ద్వారా పేషెంట్లు ఇతర ఆసుపత్రుల్లో చికిత్స పొందే అవకాశం ఉందని తెలిపారు. తన దృష్టికి వచ్చిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో మాట్లాడి పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఆయన వెంట సూపరింటెండెంట్ డాక్టర్ రాజకుమారి, ఆర్ఎం ఎం. డాక్టర్ శేషాద్రి, డాక్టర్ రవిశేఖర్‌రావు, డాక్టర్ ఎ.మురళీధర్, ఆర్ఎంఓలు డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డి, పీఎల్ శ్రీనివాస్, శ్యామ్‌సుందర్‌గౌడ్, భరత్ గౌడ్, వై.సురేష్‌కుమార్, ఎస్.రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎంఈ, ఎంటెక్ ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్ కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని విభాగాల ఎంఈ, ఎంటెక్ కోర్సుల మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్సైట్లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కు మెమోలను సంబంధిత కళాశాల నుంచి రెండు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్ కు రూ.800 చొప్పున చెల్లించి ఈ నెల 18వ తేదీలోగా, రూ.200 అపరాధ రుసుంతో 19వ తేదీ వరకు టీఎస్ ఆన్లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్ కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 19వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ లో చూసుకోవాలని సూచించారు.

25న జరిగే బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్ష వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈనెల 25న నిర్వహించనున్న బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. యూజీసీ నెట్ పరీక్ష నేపథ్యంలో ఆ పరీక్షను వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. ఈ పరీక్షను తిరిగి ఈనెల 30వ తేదీన నిర్వహించనున్నామన్నారు. పరీక్ష కేంద్రం సమయాల్లో ఎటువంటి మార్పు ఉండబోదని స్పష్టం చేశారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

ఎంఈడీ పరీక్షలు వాయిదా

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈడీ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన ఎంఈడీ మొదటి, మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.in లో చూసుకోవాలని సూచించారు.

వాసవిక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించిన గార్లపాటి సంతోష్

ముషీరాబాద్, జూన్ 16: వాసవిక్లబ్ ఇంటర్నేషనల్, తొమ్మిదో క్లబ్ సంయుక్తంగా ముషీరాబాద్ సరస్వతి ఆలయంలో సోమవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కొత్తూరు వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్ గార్లపాటి సంతోష్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి పేదలకు మందులు పంపిణీ చేశారు. చెప్పులు కుట్టే వారికి పని ముట్లతో పాటు ఆలయానికి వెయ్యి లీటర్ల వాటర్ ట్యాంక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో సుజాతరావు, జయప్రకాష్, కళా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

ముషీరాబాద్, జూన్ 16: టీఎస్ఎస్ పీడీసీఎల్ ఆజామాబాద్ డివిజన్ 11కెవి ఫీవర్ హాస్పిటల్, బర్కత్ పుర బస్ డిపో, కాచిగూడ రైల్వే స్టేషన్ ఫీడర్ల పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం (నేడు) విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు అజామాబాద్ డివిజన్ ఏడీఈ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి 1 గంట వరకు ఫీవర్ హాస్పిటల్ ఫీడర్ పరిధిలోని అంజయ్య క్వార్టర్స్, ఫీవర్ హాస్పిటల్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్‌బంక్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు బర్కత్‌పుర బస్సు డిపో ఫీడర్ పరిధిలోని రత్ననగర్, లక్ష్మీనరసింహ స్వామి టెంపుల్, అరవింద్ డిగ్రీ కాలేజ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు. మధ్యాహ్నం 3.30 నుంచి 5 గంటల వరకు కాచిగూడ రైల్వే స్టేషన్ ఫీడర్ పరిధిలోని రత్ననగర్, కాచిగూడ రైల్వేస్టేషన్, కాచిగూడ బస్సు డిపో, బీజేపీ ఆఫీస్, పారగాన్ అపార్ట్మెంట్ లైన్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదు.

బ్రాహ్మణ పాలకవర్గాన్ని నియమించాలి

చిక్కడపల్లి, జూన్ 16: బ్రాహ్మణ పరిషత్ పాలకమండలిలో శ్రీవైష్ణవులకు 50 శాతం డైరెక్టర్ పదవులు కేటాయించాలని తెలంగాణ శ్రీవైష్ణవ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో సంఘం రాష్ట్ర శాఖ ఆవిర్భావ సమావేశం జరిగింది. పలు జిల్లాల ప్రతినిధులు హాజరైనారు. జూన్ 1న జరిగిన శ్రీవైష్ణవ సేవా సమితి తెలంగాణ ఎన్నికల్లో జరిగిన అక్రమాలు అవకతకలపై, ఒంటెద్దు పోకడలపై సమావేశం తీవ్ర నిరసనను తెలిపింది. సంఘం నిర్మాణం, పటిష్టత కోసం రాష్ట్ర శాఖకు జేఏసీ కన్వీనర్‌గా పీచర కృష్ణను, కన్వీనర్‌గా డింగరి రవిని సమావేశం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కన్వీనర్స్‌తో పాటు 20 మంది సభ్యులను వెంకటాచారి, తిరువరంగం ప్రభాకర్, రవికిరణ్, అరుణ, పవన్ కుమార్, సీహెచ్ రమణ, కృష్ణమాచార్యులు, రంగాచార్య, డింగరి మధు తదితరులు ఎన్నికైనారు. ఈ కార్యక్రమంలో యాదగిరి ఆచార్యులు లక్ష్మినాథ ఆచార్యులు రామాచార్యులు తదితర సమావేశంలో పాల్గొన్నారు.

విశ్రాంత టీచర్ల బకాయిలు చెల్లించాలి

కవాడిగూడ, జూన్ 16: విశ్రాంత ఉపాధ్యాయులకు ఆర్థిక ప్రయోజనాలతో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన జీపీఎఫ్, టీఎస్ఈఎల్ఐఎ తదితర బకాయిలు చెల్లించకపోవడంతో ఉపాధ్యాయులు మనోవేదనకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని పలువురు విశ్రాంత ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. తమకు రావాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేస్తూ డి.బాల్‌రెడ్డి, జి.హన్మిరెడ్డి, మనోహర్‌రెడ్డి, లక్ష్మినరసింహ తదితరులు సోమవారం ఇందిరాపార్కు వద్ద ఒకరోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిటైర్డ్ అయిన దాదాపు పదివేల మంది ప్రభుత్వ ఉపాధ్యాయులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే తమ పోరాటాన్ని ఉధృతం చేస్తామన్నారు.

సమస్యలు అదిగమించేందుకు సన్నద్ధం

జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల సమావేశం

సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో హైడ్రా అధికారుల ప్రత్యేక సమావేశం

సికింద్రాబాద్, జూన్ 16: భారీ వర్షాలు కురిసిన సందర్భాల్లో వరద ముంపు, ట్రాఫిక్ సమస్యలు అదిగమించడం, రక్షణ చర్యల కోసం సికింద్రాబాద్‌లో జీహెచ్ఎంసీ, హైడ్రా అధికారుల ప్రత్యేక సమావేశం జరిగింది. జోనల్ కమిషనర్ ఎన్.రవికిరణ్ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన తొలి సమావేశంలో అధికారుల పరిచయ కార్యక్రమం అనంతరం ముంపు చర్యల గురించి కసరత్తు చేశారు. హైడ్రా అధికారులు డీఎఫ్ఓ వై.గౌతమ్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు పి.దత్తు, వి.సుభాష్‌రెడ్డి, జీబీ చంద్రశేఖర్, జీహెచ్ఎంసీ ఎస్ఈ ఇంజినీర్ ఆశాలత, డీసీలు రామానుజ యరెడ్డి, మారుతి దివాకర్, సుభాష్‌రావు, రాజు, డాకునాయక్, అధికారులు పాల్గొన్నారు. సర్కిళ్ల వారిగా త్వరలో జరిగే సమన్వయ సమావేశాల్లో విద్యుత్, జలమండలి, ట్రాఫిక్ పోలీసు అధికారులను భాగస్వాములు చేయాలనుకున్నారు. వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడం, ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం వంటి సందర్భాల్లో చర్యలు తీసుకునేందుకు వాహనాలు, సుశిక్షితులైన బృందాల నియామకం చేపట్టనున్నారు. డివిజన్ల వారిగా ఇంజినీరింగ్ విభాగం అధికారులను పర్యవేక్షకులుగా నియమించాలని నిర్ణయించారు. జోన్ పరిధిలోని సికింద్రాబాద్, బేగంపేట్, అంబర్‌పేట్, మల్కాజిగిరి, ముషీరాబాద్ సర్కిళ్లలో నాలా పరిస్థితులు, ముంపు ప్రమాద తీవ్రత ఉన్న ప్రాంతాల గురించి చర్చించారు. గత ఏడాది వరకు ముంపు ప్రమాద బాధితులకు రక్షిత చర్యలు చేపట్టే వాహనాలు, బృందాల నిర్వహణ జీహెచ్ఎంసీ పరిధిలో ఉండేది. ఈ వర్షాకాలం నుంచి అత్యవసర బృందాలు, వాహనాల ఏర్పాట్లు తదితర వ్యవహారాలన్నీ హైడ్రా ఆధ్వర్యంలో కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో అత్యవసర రక్షిత చర్యల కోసం జీహెచ్ఎంసీ అధికారులు తమతో సమన్వయంతో వ్యవహరించాలని హైడ్రా అధికారులు కోరారు. ముంపు సందర్భాల్లో తక్షణ రక్షణ చర్యలు చేపట్టడం కోసం ముందస్తు కార్యాచరణ సిద్ధం చేసుకునేందుకు సర్కిళ్ల వారిగా త్వరలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ఇందుకోసం ఆయా సర్కిళ్లలోని సహాయక ఇంజినీర్లు, హైడ్రా అధికారులు, అత్యవసర బృందాల పర్యవేక్షకులకు మధ్య సయోధ్య కుదుర్చాలనుకున్నారు. ఆ మీదట కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని ఐదు సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లకు సూచించారు. ముఖ్యంగా నాలాల్లో వరద ఉధృతి, నాలాలు పొంగిలోతట్టు ప్రాంతాలకు నీరు చేరడం వంటి పరిస్థితులను ముందే అంచనా వేసి, తద్వారా ప్రమాదాలను నివారించే దిశగా అప్రమత్తం కావాలనుకున్నారు.

గృహకార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఇందిరాపార్క వద్ద జరిగిన గృహకార్మికుల ధర్నాలో మాట్లాడుతున్న ఎన్‌పీడీడబ్ల్యూ కన్వీనర్ లిస్సీజోసెఫ్

కవాడిగూడ, జూన్ 16: గృహకార్మికులు ఎదుర్కొంటున్న న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎన్‌పీడీడబ్ల్యూ ప్రతినిధులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాలను వేగవంతం చేసేందుకు తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. అంతర్జాతీయ గృహకార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్‌పీడీడబ్ల్యూ ఆధ్వర్యంలో గృహకార్మికుల సమస్యలపై సుప్రీంకోర్టు తీర్పులను అమలు చేసి పటిష్టమైన చట్టం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో సంస్థ రాష్ట్ర కన్వీనర్ లిస్సీ జోసెఫ్, జాతీయ కోర్ కమిటీ సభ్యులు వర్గీస్‌తెకనాథ్, తెలంగాణ డొమెస్టిక్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు ఆన్‌జోసెఫ్, గృహకార్మికుల హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వి.మంజుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికుల హక్కులను రక్షించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో చట్టం చేయకపోవడంతో గృహకార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారని, వారికి రక్షణ లేకుండా పోతుందని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. కార్మికుల హక్కుల రక్షణకోసం, సామాజిక భద్రత కోసం సమగ్ర చట్టం రూపొందించాలని ఆరు నెలల క్రితమే సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించినప్పటికీ ఆదిశలో చర్యలు తీసుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కార్మిక ఉపాధి మంత్రిత్వశాఖ, మహిళా శిశు అభివృద్ధి శాఖలు సంబంధిత నిపుణులతో కమిటీని నియమించి సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు చట్టాన్ని రూపొందించి దేశ వ్యాప్తంగా ఉన్న కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టాన్ని అన్ని ప్రాంతాల్లో అమలు చేయాలన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి న్యాయమైన సమస్యలను పరిష్కరించి, హక్కుల రక్షణ కోసం సమగ్ర చట్టం రూపొందించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే దేశవ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ ధర్నా కార్యక్రమంలో రాష్ట్ర నలుమూలల నుంచి గృహకార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

కుస్తీ పోటీల్లో మణికంఠకు బంగారు పతకం

అండర్-15లో బంగారు పతకాన్ని సాధించిన గౌలికార్ మణికంఠ

అమీర్‌పేట్, జూన్ 16: యాకత్‌పురాలోని అలీ ఉస్తాద్ అకాడమీలో జరిగిన తెలంగాణ రెస్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో బల్కంపేటకు చెందిన వీర హనుమాన్ వ్యాయామశాలకు చెందిన గౌలికార్ మణికంఠ బంగారు పతకాన్ని సాధించారు. నిర్వాహకుడు బత్తుల రాజేశ్వర్ (ఖలీఫా) శిక్షణలో 75 కేజీల విభాగంలో మణికంఠ బంగారు పతకాన్ని సాధించడంతో త్వరలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యారు. ఈ సందర్భంగా వ్యాయామశాలకు చెందిన పలువురు విజేత మణికంఠను అభినందించారు.

ఒక్కసారిగా కుప్పకూలి జిమ్ కోచ్ మృతి

బొల్లారం, జూన్ 16: ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగా జిమ్ కోచ్ మృతి చెందిన సంఘటన బొల్లారం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొల్లారం రిసాలబజార్‌కు చెందిన జ్ఞానేశ్వర్ (24) ఆదివారం రాత్రి ఫ్రెండ్స్‌తో కలిసి బిర్యాని తిని ఇంటికి వచ్చాడు. చాతిలో నొప్పి రావడంతో స్థానిక ఆర్ఎంపీ వైద్యుడు వంశీ వద్దకు వెళ్లగా, గ్యాస్ట్రిక్ సమస్య అని చెప్పి ఇంజక్షన్ ఇచ్చి ఇంటికి పంపించాడు. దీంతో క్లినిక్ నుంచి ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే జ్ఞానేశ్వర్ ఇంటి వద్ద కుప్పకూలిపోయాడు. వెంటనే అతనిని కంటోన్మెంట్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరీక్షించిన వైద్యులు సరైన ఆక్సిజన్ అందకపోవడం వల్ల మృతి చెందినట్లు ధ్రువీకరించారు. దీంతో కోపోద్రిక్తులైన కుటుంబ సభ్యులు, బంధువులు క్లినిక్ వద్దకు చేరుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఆర్ఎంపీపై హత్య కేసు నమోదు చేయాలని బంధువులు డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న బొల్లారం పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఆర్ఎంపీని అదుపులోకి తీసుకున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఉన్నతాధికారుల సమీక్ష

ఏర్పాట్లను సమీక్షిస్తున్న శైలజా రామయ్యర్, చిత్రంలో కలెక్టర్ హరిచందనతో పాటు నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రంసింగ్ మాన్

అమీర్‌పేట్, జూన్ 16: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ వేడుకల్లో భాగంగా భక్తులకు కల్పించాల్సిన ఏర్పాట్లలో పటిష్టమైన చర్యలు చేపడతామని దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యర్ తెలిపారు. సోమవారం రాత్రి ఆలయ ఆవరణలో జరిగిన సమావేశంలో దేవాదాయ శాఖ కమిషనర్ వెంకట్రావు, కలెక్టర్ దాసరి హరిచందన, నగర పోలీస్ అదనపు కమిషనర్ విక్రంసింగ్ మాన్, జలమండలి సీజీఎం ఎం.ప్రభు, దేవాదాయ శాఖ ఆర్జేసీ రామకృష్ణారావుతో కలిసి ఇక్కడ చేపట్టాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. అమ్మవారి కల్యాణోత్సవానికి సంబంధించి జారీ చేయాల్సిన కల్యాణ టిక్కెట్లు ఎన్ని, దేవాలయ నలు మూలల నుంచి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు వస్తుండే భక్తులు తోపులాటలకు గురి కాకుండా ఎక్కడెక్కడ బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలనే అంశాలపై ఆర్‌అండ్‌బీ అధికారులతో కలిసి సమీక్షించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భక్తుల నియంత్రణకు సంబంధించి దేవాలయ పరిసరాల్లో చేపట్టాల్సిన పోలీస్ బందోబస్తు వంటి అంశాలపై ఆలయ అధికారులు ఉన్నతాధికారులకు తగిన సమాచారాన్ని అందించారు.

బాణాల వెంకటయ్యకు ఓయూ డాక్టరేట్

బాణాల వెంకటయ్య

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ కామర్స్ విభాగంలో బాణాల వెంకటయ్య డాక్టరేట్ సాధించారు. విభాగం హెడ్ ప్రొఫెసర్ గంగాధర్ పర్యవేక్షణలో 'కస్టమర్స్ సాటిస్ఫాక్షన్ టువర్డ్స్ ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్‌పు: ఎ స్టడీ విత్ రిఫరెన్స్ టు ఈ-మార్కెటింగ్ పోర్టల్ ఇన్ ట్విన్ సిటీస్ ఆఫ్ హైదరాబాద్ అండ్ సికింద్రాబాద్' అంశంపై పరిశోధన పూర్తి చేసి సమర్పించిన పరిశోధనా గ్రంథాన్ని పరిశీలించిన ఓయూ ఎగ్జామినేషన్ బ్రాంచ్ అధికారులు ఆయనకు పీహెచ్‌డీ పట్టాను ప్రదానం చేస్తున్నట్లు ఒక ప్రకటన విడుదల చేశారు. నల్గొండ జిల్లా నాంపల్లి మండల కేంద్రానికి చెందిన బాణాల ఉపేంద్రమ్మ, యాదయ్యల కుమారుడు చిన్నతనంలోనే పోలియో వ్యాధి సోకి దివ్యాంగుడయ్యాడు. పేదరికం, వైకల్యం లెక్కచేయకుండా తల్లిదండ్రులు ఉన్నత విద్యను చదివించారు. వెంకటయ్య బాల్యం నుంచి ఎన్నో ఒడిదుడుకులకు లోనవుతూ, చదువులో రాణిస్తూ వైకల్యాన్ని లెక్కచేయకుండా ఓయూలో ఎంకామ్ చదివారు. అనంతరం పీహెచ్‌డీ సైతం పూర్తి చేశాడు. తెలంగాణ సెట్, యూజీసీ నెట్ పరీక్షలలో అర్హత సాధించాడు. బాణాల వెంకటయ్య తెలంగాణ ఉద్యమం, దివ్యాంగుల హక్కుల సాధనలో తనవంతు పాత్ర పోషించాడు. ఈ సందర్భంగా ఆయనను కుటుంబ సభ్యులు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించారు.

దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లు ఇవ్వాలి

చిక్కడపల్లి, జూన్ 16: ఆసరా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి వెంటనే పెన్షన్లు ఇవ్వాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్ తహసీల్దార్ కార్యాలయం ముందు సీపీఎం ముషీరాబాద్ జోన్ కమిటీ ఆధ్వర్యంలో నిరసన చేట్టారు. సీపీఎం జోన్ కార్యదర్శి ఆర్.వెంకటేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి సుమారు 18 నెలలు గడుస్తున్నా కొత్త పెన్షన్ల మాటే ఎత్తడం లేదని విమర్శించారు. వెంటనే దరఖాస్తు చేసుకున్న అందరికీ పెన్షన్లను మంజూరు చేయాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో వాగ్దానం చేసిన విధంగా వృద్ధులు వితంతులకు రూ.4వేలు, వికలాంగులకు రూ.6వేలు పెంచాలని డిమాండ్ చేశారు. నిరసన అనంతరం తహసీల్దార్ సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శివర్గ సభ్యులు కె.రమేష్, వెంకటమ్మ, మల్లయ్య రమణమ్మ, నారాయణమ్మ, శ్రీనివాస్, వెంకటయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కేశవరావు జాదవ్ ఆశయాలు ఆదర్శనీయం

ఖైరతాబాద్, జూన్ 18: తెలంగాణ ఉద్యమకారుడు దివంగత ప్రొఫెసర్ కేశవరావు జాదవ్ ఆశయాలు ఆదర్శనీయమని వక్తలు అన్నారు. కేశవ రావు జాదవ్ వర్ధంతి సందర్భంగా సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ప్రొఫెసర్ హరగోపాల్, మానవ హక్కుల సంఘం సభ్యుడు జీవన్ కుమార్, న్యాయవాది చంద్రశేఖర్, తెలంగాణ ఉద్యమకారులు రఫీ, బత్తుల సిద్దేశ్వర్, సోషిలిస్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రతో కలిసి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమానికి ఆయన దిక్సూచిగా నిలిచారన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుకు ఆయన చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని, ఉస్మానియా యూనివర్సిటీలోని లైబ్రరీకి ఆయన నామకరణం చేయాలని, ఆ మేరకు ప్రభుత్వాన్ని విన్నవించాలని కోరారు.

'అంతిమ యుద్ధాన్ని' వెంటనే ఆపాలి

గోడపత్రికను ఆవిష్కరణ చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

జవహర్‌నగర్, జూన్ 16: ఆపరేషన్ కగార్ అంతిమ యుద్ధాన్ని వెంటనే ఆపేయాలని, మోదీ ప్రభుత్వం కాల్పుల విరమణ ప్రకటించి మవోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని న్యూడెమెక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ డిమాండ్ చేశారు. కగార్ అంతిమ యుద్ధాన్ని వెంటనే ఆపాలని డిమాండ్ చేస్తూ నెల 17న ధర్నాచౌక్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం న్యూడెమెక్రసీ రాష్ట్ర నాయకురాలు అనురాధ ఆధ్వర్యంలో జవహర్‌నగర్ కార్పొరేషన్ అంబేద్కర్ చౌరస్తాలో గోడపత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు షేక్ షావలి, అల్లూరి సావిత్రి, దశరథ, వెంకట్రాద్రి, స్వరూప, మల్లేష్, అంజనేయులు, పరమేష్, రవిచారి, వెంకటాచారి, యాదయ్య, సునీత, కుర్మయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పుట్‌పాత్‌పై జూనియర్ ఆర్టిస్ట్ మృతి

వెంగళరావునగర్, జూన్ 16: పుట్‌పాత్‌పై జూనియర్ ఆర్టిస్ట్ మృతి చెందిన ఘటన మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృష్ణానగర్‌లో చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. కృష్ణానగర్‌లో ఉండే వివేక్ (28)ఆదివారం సినిమా షూటింగ్‌కు వెళ్లొచ్చాక కృష్ణానగర్ చేరుకున్నాడు. సోమవారం ఉదయం రహదారి పక్కన పుట్‌పాత్‌పై మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు వివేక్‌కు అప్పుడప్పుడు మూర్ఛ వచ్చి పడిపోతుండేవాడని, మద్యం అలవాటు కూడా ఉందని తోటి సిబ్బంది తెలిపారు. మద్యం మత్తులో అతను మూర్ఛ వ్యాధితో పుట్‌పాత్‌పై పడిపోయి మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు అదృశ్యం

శామీర్‌పేట, జూన్ 16: యువకుడు అదృశ్యమైన ఘటన శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసింది. తూంకుంటకు చెందిన ముడావత్ గోపాల్